ఆంధ్రజ్యోతి



## సికింద్రాబాద్ జోన్

బుధవారం, 25 డిసెంబర్, 2013

### యశోద ఆస్పత్రిలో పాతికేళ్ల గృహిణికి

# గుండె మార్పిడి



తన ప్రాణాలు కాపాడిన యశోద వైద్య బృందంతో రమ్య

- బైపాస్ సర్జరీకి పట్టేంత సమయంలోనే పూర్తి!

హైదరాబాద్, డిసెంబర్ 24 (ఆంధ్రజ్యోతి-సిటీబ్యూరో): బైపాస్ సర్జరీ చేయడానికి పట్టేంత సమయంలోనే ఆ మహిళకు విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్స పూర్తయింది! బ్రెయిన్‌డెడ్ రోగి నుంచి తొలగించిన గుండెను ఆ మహిళకు అమర్చిన రెండు గంటల్లో రక్తప్రసరణ మొదలైంది. ఆ వెను వెంటనే ఆమెకు అమర్చిన హార్ట్ లంగ్ పంపింగ్ మిషన్ తొలగించారు. అవయవాల పనితీరు మెరుగుపడడంతో ఏడు గంటల్లోనే కృత్రిమ శ్వాస కూడా నిలిపివేశారు. ఇక రెండో రోజు నుంచే ఆ గృహిణి నడవడం మొదలు పెట్టింది. ఈ నెల 16న యశోద ఆస్పత్రి వైద్యులు సాధించిన ఘనత ఇది. ఆస్పత్రి చీఫ్ కార్డియోథోరాసిక్ సర్జన్, గుండె మార్పిడి, చిన్న కోత శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ ఏజీకే గోఖలే గుండెమార్పిడి విధానాన్ని మంగళవారం విలేకరులకు వివరించారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి చెందిన వెంకట రమ్య(25)కు మొదటి ప్రసవం తరువాత గుండె సమస్య మొదలైంది. ఆరేడేళ్లుగా గుండెదడ, నడిస్తే ఆయాసం, నాలుగు అడుగులు వేయలేని స్థితి, గట్టిగా ఊపిరిపీల్చుకోని పరిస్థితితో ఆమె బాధపడుతున్నారు. చివరకు ఆమె యశోద ఆస్పత్రి వైద్య నిపుణులను కలవగా.. ఆమె 'పోస్ట్‌పార్టమ్ కార్డియోమయోపతీ' (గర్భధారణ సమయంలో వచ్చే గుండెజబ్బు)తో బాధపడుతున్నట్టు వారు నిర్ధారించారు. సాధారణంగా.. 5-6 లీటర్ల రక్తప్రసరణ జరగాల్సిన సమయంలో లీటర్ రక్తమే ఆమె గుండెకు అందుతోంది. దీనివల్ల రోజురోజుకూ ఆమె గుండె స్పందన తగ్గిపోయి బలహీనంగా మారిపోయింది. దీంతో వైద్యులు ఆమెకు గుండె మార్పిడి తప్పదనే నిర్ధారణకు వచ్చారు. గుండెదాత కోసం 'జీవన్‌దాన్'కు సమాచారం అందించారు.

**మరొకరికి దక్కాల్సిన గుండె...**

హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో 21 ఏళ్ల యువకుడు బ్రెయిన్‌డెత్‌కు గురవడంతో.. అవయవ దానం కోసం జీవన్‌దాన్ సభ్యులు అతడి కుటుంబసభ్యులను ఒప్పించారు. ఆ యువకుడి హృదయాన్ని.. గుండెమార్పిడి అత్యవసరమైన 19ఏళ్ల యువకుడికి అమర్చాలని నిర్ణయించారు. కానీ, అంతలోనే ఆ యువకుడు మరణించడంతో గుండెను రమ్యకు అమర్చేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 16న రాత్రి 9.30 గంటలకు లక్డీకాపూల్‌లోని ఆస్పత్రిలో గుండెను తీసుకుని ప్రత్యేక బాక్స్‌లో పెట్టుకుని అంబులెన్స్‌లో ట్రాఫిక్ పోలీసుల సాయంతో ఎనిమిది నిమిషాల్లో యశోద ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే 16 మంది వైద్యులు శస్త్రచికిత్స ప్రారంభించారు. బలహీనమైన రమ్యగుండెను తొలగించి, ఆమెకు హార్ట్, లంగ్ పంపింగ్ మిషన్‌ను అమర్చారు. దాదాపు రెండు గంటల పాటు ఈ మిషన్ ద్వారా ఆమెకు కృత్రిమ స్పందనలు కల్గిస్తూ గుండె మార్పిడి ప్రక్రియను నిర్వహించారు. సాధారణంగా గుండె మార్పిడి ఆపరేషన్‌కు దాదాపు మూడున్నర గంటల సమయం పడుతుంది. అయితే ఎంత త్వరగా గుండెను అమరిస్తే అంత ఎక్కువగా రోగికి ఫలితాలు అందుతాయనే ఉద్దేశంతో రెండు గంటల్లోనే శస్త్రచికిత్స ముగించినట్టు డాక్టర్ గోఖలే వివరించారు. ఆ తర్వాత మిగతా ప్రక్రియను మరో మూడు గంటల్లో పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం రమ్య పూర్తిగా కోలుకుందని, ఏడాది వరకూ ఎటువంటి ఇన్‌ఫెక్షన్, ఇతర వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కాగా.. వైద్యులు తనకు పునర్జన్మ ప్రసాదించారని రమ్య సంతోషం వ్యక్తం చేశారు. యశోద ఆస్పత్రుల ఎండీ జీఎస్ రావు, హృద్రోగ వైద్య నిపుణులు రాజశేఖర్, విశ్వనాథ్ దిలీప్ రాఠీ, సుబ్రహ్మణ్యం, సుధాకర్, మాధవ్, సాయిచంద్ర, జీవన్‌దాన్ నిర్వాహకురాలు అనూరాధ, రమ్య కుటుంబసభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### ఇదీ సమస్య!

గర్భిణులకు ప్రసవం వరకూ గుండె పరిమాణం (బెలూన్ మాదిరిగా) పెద్దగా ఉంటుంది. కడుపులో ఉన్న బిడ్డకు కూడా ఆమె గుండె ద్వారానే రక్తప్రసరణ జరుగడమే ఇందుకు కారణం. ప్రసవం తరువాత కొద్దిరోజులకు వారి గుండె పరిమాణం మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటుంది. కానీ రమ్య విషయంలో అలా జరగలేదు. గుండె పరిమాణం అలాగే ఉండిపోయింది. దీన్నే వైద్య పరిభాషలో 'పోస్ట్‌పార్టమ్ కార్డియోమయోపతీ'గా వ్యవహరిస్తారు. ఇలాంటివారి పరిస్థితి విషమిస్తే గుండె మార్పిడి ఒక్కటే మార్గం. కాగా.. ఈ చికిత్సకు దాదాపు 15 లక్షల రూపాయల వ్యయం అయిందని, రెండేళ్ల వరకూ ఆమె రెండోసారి గర్భం దాల్చడానికి వీలుండదని వైద్యులు చెప్పారు.